ప్రజాశక్తి

గురువారం 30 మార్చి 2023



పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో విజ్జి స్టేడియం దగ్గర గల ఎస్‌సి బాలుర వసతిగృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెగ్యులర్ సంక్షేమాధికారిని నియమించాలని ఎస్ ఎఫ్ఐ నాయకులు డిఆర్ఒ గణపతిరావుకు బుధవారం వినతి అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, కనీసం మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయం కూడా లేక విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి హాస్టల:కు పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని, సదుపాయాలను కల్పించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం చేస్తామని అన్నారు. వినతినిచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు ఎస్.సోమేష్, ప్రసాద్ ఉన్నారు.

గుర్ల మండలం పల్లిగండ్రేడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



33 శాతం నష్టం జరిగితేనే పరిహారం


నివేదిక పంపాలని ప్రభుత్వ ఆదేశం

4,550 ఎకరాల్లో పంటనష్టం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు విజయ నగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కురిసిన వర్షాలు, పెనుగాలులకు వ్యవసాయ, ఉద్యాన పంటల్లో తీవ్ర నష్టం జరిగింది. దీంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట నష్టాలపై ప్రభుత్వ శాఖల అంచనా కొలిక్కి వచ్చింది. ఈ వివరాలను వెంటనే ప్రత్యేక పోర్టర్‌లో నమోదు చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. రెండు జిల్లాల్లో కలిపి 4550 ఎకరాల్లో పంట నష్టంజరిగినట్లు అంచనా. విజయనగరం జిల్లాలో 13 మండలాల పరిధిలోని 91 గ్రామాల్లో 3,400 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. ముఖ్యంగా చేతికి అందాల్సిన దశలో మొక్కజొన్న కంకులు పెనుగాలకు నేలమట్టమయ్యాయి. దీనికి సంబంధించి లెక్కలు 90శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10శాతం గణన పూర్తికాగానే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మరోవైపు జామి, దత్తిరాజేరు, రామభద్రపురం,పూసపాటిరేగ, నెల్లిమర్ల తదితర 10 మండలాల్లో సుమారు 150ఎకరాల్లో అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్టు తేలింది. అక్కడక్కడ బొప్పాయి తోటలు కూడా దెబ్బతిన్నాయి. తుదిజాబితా మరో రెండు మూడు రోజుల్లో ఖరారు అవుతుందని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అంచనా. అందులో అరటి పంట సుమారు 100 ఎకరాల్లో దెబ్బతింది. గరుగుబిల్లి, వీరఘట్టం, సాలూరు, పాచిపెంట, మక్కువ, కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాల్లో ఎక్కువగా నష్టం జరిగింది. పాచిపెంట, సాలూరు తదితర మండలాల్లో సుమారు 900 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. ఈనెల ఆఖరులోగా స్పష్టమైన లెక్కలతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నారు. నష్టపరిహారం చెల్లింపులపై కూడా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను స్పష్టం చేసింది. ప్రతి రైతుకూ పంటల వారీగా సాధారణ ఉత్పత్తిలో 33శాతం నష్టం వాటిల్లిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. దీనికితోడు ఆయా పంటలు ఇప్పటికే ఇ-క్రాప్‌లో నమోదై ఉండాలని మెలిక కూడా ఉంది.

ఆర్జిత సెలవుల డబ్బులేవి?



- టిఎ, డిఎల కోసమూ ఎదురు చూపే!
- సగటు ఉద్యోగుల్లో నిరాశ

ప్రభుత్వ ఉద్యోగం అంటే బతుకుదెరువుపై బీమా? మెరుగైన వేతనాలు, అవి కూడా నిర్దిష్టమైన కాలపరిమితిలో అందుతాయనే భరోసా.. పనిలో మరింత ఉత్సాహం నింపే విధంగా టిఎ, డిఎలు, అదనపు ప్రోత్సాహకాలు ఎంతో దోహదపడతాయి. సర్వీసు మధ్యలోనే ఇల్లో, పెళ్లో అనుకుంటే జిపిఎఫ్ రూపంలో దాచుకున్న సొమ్ము తీసుకోవచ్చనే భావన. ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఎర్నడ్ లీవ్స్ ఉపయోగించుకోకపోవడం సాధ్యం కాకపోయినా సరెండర్ లీవ్ పేరిట ఆయా రోజులకు సంబంధించిన వేతనం కూడా వచ్చేస్తుంది. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి, ప్రైవేటు కొలువులకు మధ్య ఉన్న తేడా. కానీ, ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఒకటో తేదీ నాటికి ఖాతాల్లో జీతాలు పడతాయనే బీమా లేదు. టిఎ, డిఎలు ఏళ్ల తరబడి పెండింగ్. ఇక ప్రోత్సాహకాలు ఆశించడం అత్యాసే అవుతుంది. జిపిఎఫ్ మాత్రం ఎట్టకేలకు విడుదల చేయడంతో దాని కోసం దరఖాస్తు చేసుకున్న కొంతమంది ఉద్యోగులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా సుమారు 22,821 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో ప్రతి నెలా 1 లేదా 2, 3 తేదీల్లోపు జీతాలు అందేవి. ప్రస్తుతం ఆయా తేదీల్లో జీతాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని, ఒక్కోసారి 10వ తేదీ వరకు అందడం లేదని ఎక్కువ శాఖల ఉద్యోగులు, అధికారులు ఆవేదన. పోలీస్, వైద్యారోగ్యం, విద్యుత్ వంటి అత్యవసర విభాగాలు శాఖలకు ప్రాధాన్యతా క్రమంలో వేతనాలు వేస్తున్నట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండేళ్లగా ఇదే పరిస్థితి ఉండడంతో ఉద్యోగులు కూడా చాలా వరకు అలవాటు పడ్డారు. సరెండర్ లీవ్‌లకు రావాల్సిన డబ్బులు రాకపోవడాన్ని ఉద్యోగులు, అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతి ఉద్యోగికీ వారంతపు సెలవులు, ప్రత్యేక సెలవులు, మెడికల్ లీవ్స్, ప్రసూతి సెలవులతో నిమిత్తం లేకుండా ఏడాదికి 30 ఎర్నల్ లీవ్స్ ఉంటాయి. ఈ లెక్కన 30ఏళ్ల సర్వీసుగల ఉద్యోగికి ఏడాదికి 15చొప్పున 490సెలవులు ఆదా అవుతాయి. వీటికి సంబంధించిన ఎన్‌క్యాష్‌మెంట్ ఉద్యోగ విరమణ సమయంలో విడుదల చేస్తారు. కానీ, నెల నెలా మిగిలిపోయిన సెలవులకు ఎప్పటికప్పుడు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే చెల్లింపులు చేయాల్సివుంది. కానీ, రెండేళ్లగా వీటికి సంబంధించిన నగదు విడుదల చేయలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు లేదా సీనియర్ ఎంప్లాయిస్‌కు ఈ రూపంలో రావాల్సిన మొత్తం రూ.లక్షల్లోనే ఉంటుంది. ఎర్నడ్ లీవ్‌లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల నుంచి ఆదాయ పన్ను సైతం ప్రభుత్వం వసూలు చేసింది. కానీ ఇంతవరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

మరోవైపు డిఎల ప్రస్తావన కూడా ప్రభుత్వం నుంచి కనిపించడం లేదు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం డిఎ ప్రకటించినప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఎ పెంచడం మన రాష్ట్రంలో కొన్నాళ్లగా అనవాయితీగా సాగుతోంది. ఈలెక్కన ఇప్పటి వరకు నాలుగు దఫాలుగా పెంచలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఒక సందర్భంలో డిఎ సొమ్ము ఖాతాల్లో వేసినట్టే వేసి, కొన్ని గంటల్లో వెనక్కి తీసుకున్నారని కూడా కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగి లేదా అధికారి తమ శాఖాపరమైన పనిపై ఎక్కడికైనా వెళ్లినప్పుడు అందుకు అవసరమైన ప్రయాణం, భోజనం ఇతరత్రా ఖర్చుల నిమిత్తం కొంత బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి దాదాపు కనిపించడం లేదని ఉద్యోగుల నుంచి అధికారుల వరకు చెబుతున్నారు. చివరకు వాహనాల అద్దెలు, పెట్రోల్ ఖర్చులు కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. తమ సర్వీసులో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు చూడలేని ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్న బడ్జెట్‌ను అటు ఇటు సర్ధుబాటు చేసి ప్రజల మెప్పు పొందాలన్న ఆశ, యావ తప్ప, సంపదను సృష్టించే ఉద్యోగుల వేతనాలకు, సంక్షేమ పథకాలకు సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పించగలమన్న ఆలోచన లేదని ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సామాజిక భవనంపై అంబేద్కర్ ఫొటోనా?

తక్షణమే ఖాళీ చేయాలని వైసిపి నాయకుల హుకుం

శాసనాపల్లిలో దళితుల ఆందోళన

ప్రజాశక్తి - జామి

'సామాజిక భవనంపై అంబేద్కర్ ఫొటోనా..! ఫొటో ఉన్నంత మాత్రానా అంబేద్కర్ భవనం అయిపోతుందా...? కుదరదు, వెంటనే ఖాళీ చేయండి.. అంటూ హుకుం జారీ చేయడంతో పాటు భవనంపై ఉన్న అంబేద్కర్ ఫోటోపై పెయింట్ వేసి, వైసిపి నాయకులు చెరిపేశారు. అక్కడితో ఆగకుండా అసలు అంబేద్కర్ ఎవరు..? మీ సంగతి చూస్తాం అని బెదిరించారు. ఇదంతా మండలంలోని శాసనాపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఉదంతం దళిత వివక్షతకు నిలువెత్తు నిదర్శనం ఈ నేపథ్యంలోనే గ్రామంలోని దళితులు జామి పోలీసులను ఆశ్రయించారు. హుటాహుటిన గ్రామానికి చేరుకున్న ఎస్ఐ వీరబాబు ఇరువర్గాలను మందలించారు.

మండలానికి శివారు గ్రామమైన శాసనాపల్లిలో సుమారుగా 250 నుంచి 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో అన్ని సామాజిక తరగతులతో పాటు దళితులు 25 కుటుంబాల వరకు నివసిస్తున్నారు. తాతల తండ్రులు నుంచి అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్న ఈ గ్రామంలో రామాలయం నిర్మాణం వివక్షతకు ఆజ్యం పోసింది. గ్రామంలో 2003లో అప్పటి ప్రభుత్వ పెద్దలు ప్రస్తుత ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హయాంలో ఒక సామాజిక భవనాన్ని నిర్మించారు. అది దళిత నివాసాల మధ్య ఉండడంతో పాటు ప్రారంభంలోనే దానికి అంబేద్కర్ భవనం అని నామకరణం చేశారు. పేరు అంబేద్కర్ భవనం అయినప్పటికీ బిసిలు, దళితులు ఉమ్మడిగా దానిని వినియోగించుకునే వారు. కానీ తాజాగా గ్రామంలో రామాలయం నిర్మాణం ప్రారంభమైంది. గుడి నిర్మాణానికి ఎవరూ వ్యతిరేకించలేదు. కానీ నిర్మాణ కార్మికులను అంబేద్కర్ భవనంలో తాత్కాలికంగా నివాసం ఉంచాలని అధికార పార్టీ నాయకులు భావించారు. దీంతో దళితులకు, వైసిపి నాయకుల అనుచరులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. అందులో భాగంగానే కొందరు భవనంపై ఉన్న అంబేద్కర్ బొమ్మ కనిపించకుండా పెయింట్ వేశారు. అంబేద్కర్ ఎవరూ అంటూ మాట్లాడారని దళితులు పోలీసులను ఆశ్రయించారు. అయితే ఎస్ఐ వీరబాబు చొరవతో వివాదం సద్దుమణిగింది.

గంటేడకు పతంజలి పురస్కారం

గర్వించదగ్గ గొప్ప రచయిత పతంజలి : గౌరునాయుడు



గంటేడ గౌరునాయుడును సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప రచయిత, పాత్రికేయుడు, సినీ మాటల రచయిత కెఎన్‌వై పతంజలి పేర ప్రతి ఏటా అందించే సాహితీ పురస్కారం ఈ ఏడాది ప్రఖ్యాత కథకులు, కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడుకు దక్కింది. కెఎన్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన బుధవారం గురజాడ పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరునాయుడుకు ఈ పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. ముందుగా పతంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరునాయుడు మాట్లాడుతూ పతంజలి పురస్కారం తనకు రావడం ఆనందంగా ఉందన్నారు. పతంజలి రచనలకు విజయనగరం జిల్లా కేంద్ర బిందువుగా ఉండేదని, తన రచనా ప్రవాహం, మాటల తూటాలతో వ్యవస్థలో కుళ్లును కడిగే ప్రయత్నం చేశారని తెలిపారు. తెలుగు సాహిత్య చరిత్రలో పతంజలి ఎవరికన్నా తక్కువ కాదని, ప్రతి రచయితకు విమర్శకులు ఉండేవారని, ఒక్క పతంజలికి మాత్రమే గొప్ప స్నేహితులు ఉండేవారని అన్నారు. నేటి తరం విద్యార్థులు పతంజలి రచనలు చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మరో రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ గురజాడ గిరీశంను సృష్టిస్తే పతంజలి గోపాత్రుడ్ని సృష్టించి విభిన్న తరహాలో ప్రజల ముందుకు తెచ్చారని కొనియాడారు. ప్రజల భాష, గుండె ఘోష తెలిసిన రచయిత కాబట్టే అందరి మన్ననలు పొందారని, రచనలో చమత్కారం పతంజలి కథకి ఆయువు పట్టుగా ఉండేదని అన్నారు. వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అధ్యక్షత వహించిన ఈ సభలో కథా రచయిత మల్లిపురం జగదీష్, పతంజలి సతీమణి ప్రమీలా, అల్లుడు రామకృష్ణరాజు, డాక్టర్ మోహన్, వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు, విఎమ్‌కె లక్ష్మణరావు, సీనియర్ పాత్రికేయుడు ఎలిశెట్టి సురేష్, హోటల్ మయూరి అధినేత బాబూరావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, కందాల సాయిబాబా, గురజాడ ఇందిరా, చీకటి చంద్రిక, కాంచన, దవడ కొండబాబు, కె. శ్రీనివాసరావు, గిడుతూరి పైడితల్లి, ఇప్పలవలస గోపీ, రామచంద్ర రాజు, గాయకుడు డప్పుశ్రీను, జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంటేడకు ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అభినందన

ప్రముఖ కథా రచయిత, కవి, నిత్య సాహిత్య కృషీవలుడు గంటేడ గౌరు నాయుడుకు 'పతంజలి సాహిత్య పురస్కారం' రావడం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ అదపాక సత్యారావు అభినందనలు తెలిపారు. గౌరునాయుడు మాస్టారు రైతులు, రైతు కూలీలు, గ్రామీణ ప్రాంత సకల వృత్తుల వారి కష్ట నష్టాలు, దయనీయ స్థితిగతులు తన రచనల ద్వారా సమాజం దృష్టికి నిరంతరం తీసుకువస్తూ, సాహిత్య వ్యవసాయాన్ని పండిస్తున్నారని సత్యా రావు ఒక ప్రకటనలో ప్రశంసించారు. గౌరునాయుడు మరిన్ని పురస్కారాలు, సత్కారాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, డిఆర్ఒ, డిఇఒ, డిఎంహెచ్ఒ, డిఎస్‌పి

టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

పదో తరగతి పరీక్షలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పరీక్షల నిర్వహణపై విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలసి మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా కలెక్టర్లతో బుధ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30నుండి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతుందని ఆయన వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. పక్కా కార్యాచరణతో, అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సూర్య కుమారి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని 25 మండలాల్లో 127 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 24,099 మంది రెగ్యులర్ అభ్యర్థులు, 1,428 ప్రైవేటు అభ్యర్థులు మొత్తం 25,527 మంది హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల కేంద్రాలను తహశీల్దార్లు, ఎంపిడిఒలు తనిఖీ చేసి ప్రతి రోజు జిల్లా కల్లెకర్ కు నివేదికలు అందజేయలన్నారు. ప్రతి కేంద్రం వద్దా 144సెక్షన్ అమలు చేయాలన్నారు. 9 ఫ్లైయింగ్ స్క్వాడ్లను తహశీల్దార్ల ఆధ్వర్యంలో వేస్తున్నట్లు తెలిపారు. . ప్రశ్నా పత్రాల కష్టోడియన్ గా జిల్లా రెవిన్యూ అధ్దికారి వ్యవహరిస్తారని తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్ అయిన కోట హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సందేహాలకు, సమస్యల నివారణకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 94943 26124 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ గణపతి రావు, డిఇఒ లింగేశ్వర రెడ్డి , డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి, డిఎస్‌పి శేషాద్రి , పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మికుమారి, విద్యుత్ శాఖ ఎస్ఇ, డిప్యూటీ డిఇఒలు, ఆర్‌టిసి ఆర్ఎం పాల్గొన్నారు.

నేడు పన్నులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీరామనవి రోజున గురువారం కూడా ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ఆస్తి పన్నులను నగరపాలక సంస్థ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, సచివాలయాల ద్వారా స్వీకరిస్తామని సహాయ కమిషనర్ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉన్నప్పటికీ పన్నులు చెల్లించుకునే వెసులు బాటును కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం ఏప్రిల్ 5న ప్రజా సంఘాలు చేపట్టిన మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో విజయనగరం మార్కెట్ యార్డు వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారం లో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను పెట్టుబడిదారు లకు కట్టబెట్టి దేశ సంపదను లూటీ చేస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ రైతుకి కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణమాఫీచేయాలని డిమాండ్ చేశారు. ఈడిమాండ్ల సాధనకు నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు నగర కార్యదర్శి . బి.రమణ, కార్మికులు పాల్గొన్నారు.

రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రూ.3.50కోట్లతో 50 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. బుధవారం శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా బుధవారం 5,6,1,13,20 డివిజన్ లలో అభివద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. సకాలంలో పనులు పూర్తయ్యే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఏప్రిల్ 6వ తేదీన ప్రారంభ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో తాము చేపట్టిన వార్డు పర్యటనలో గాని, ప్రస్తుతం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న సమయంలో గాని వచ్చిన ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి ఆయా ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వారం రోజులపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి పనులకు శ్రీకారం చేపడుతున్నా మన్నారు. ఇంకా ఎక్కడైనా అభివద్ధి పనులు అవసరమనుకుంటే సంబంధిత కార్పొరేటర్ ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు గాదెం మురళి, ఆల్తి సత్యకుమారి,తవిటిరాజు, జోనల్ ఇన్‌చార్జులు, ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కాళ్ల సూరిబాబు, నగరపాలక సంస్థ ఇఇ కె. శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, ఎఇలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకూ కోలగట్ల

నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్‌లో నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకొని వారికి అందు తున్న ప్రభుత్వ పథకాలను తెలుసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 21వ డివిజన్ కార్పొరేటర్ కనకాల నాగవల్లి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, జోనల్ ఇన్చార్జి కాళ్ళ సూరిబాబు, కనకల గిరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంనాయుడుకు పతకాల పంట

అభినందించిన ఎస్‌పి దీపిక



కృష్ణంనాయుడును అభినందిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రం లోని మిడ్నాపూర్‌లో జరిగిన 42, 43వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో విజయ నగరం రూరల్ పోలీసు స్టేషనులోపని చేస్తున్న వి.కృష్ణం నాయుడు విశేష ప్రతిభ కనబర్చి నాలుగు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన కృష్ణంనాయుడు ఎస్‌పి ఎం.దీపికను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవగా, ఆయనను అభినంది ంచారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో హెడ్ కానిస్టేబులుగా పనిచేస్తున్న కృష్ణమూర్తి క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో సాధన చేసి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆయన క్రీడా స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని కొనియాడారు. మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మిడ్నాపూర్‌లో ఫిబ్రవరి 10 నుండి 12 వరకు జరిగిన 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ (60 ప్లస్ విభాగం) పోటీల్లో పాల్గొన్న కృష్ణమూర్తి 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 4X400 మీటర్లు రిలే పరుగులోనాలుగు బంగారు పతకాలు, 4 X 100 మీటర్లు రిలే పరుగులో రజత పతకం సాధించా రన్నారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోల్‌కత్తాలో ఫిబ్రవరి 14 నుండి 18 వరకు జరిగిన 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో (60 ప్లస్(విభాగంలో పాల్గొన్న కృష్ణమూర్తి 800 మీటర్ల పరుగులో రజత పతకం, 400 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారని తెలిపారు. కృష్ణమూర్తిని డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సిఐ టివి తిరుపతిరావు, ఎస్ఐ గణేష్ అభినందించారు.

రామయ్యకు తలంబ్రాలు సమర్పణ


తలంబ్రాలను అందుకుంటున్న అర్చకులు

నెల్లిమర్ల : శ్రీరామనవమి కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారికి తలంబ్రాలను వినియోగించే నిమిత్తం గోటితో ఒలిచిన తలంబ్రాలను సిద్ధం చేసి, ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామా చార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ బిహెచ్ఎస్ఎస్ కిషోర్ కుమార్‌కు రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులు బుధవారం అందజేశారు. ముక్కోటి ఏకాదశి నుండి శ్రీ రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో రామ భక్తులు ఉపవాస దీక్ష, బ్రహ్మచర్య దీక్ష వహించి రామనామాన్ని జపిస్తూ తలంబ్రాలను సిద్ధం చేశారు. ఈ సంఘం వారు భక్తిశ్రద్ధలతో శ్రీ రామలక్ష్మణ, హనుమ, అంగద, జాంబవంత మొదలైన వారి విగ్రహాలతో సేద్యం చేసిన వరికంకులను కోసి ధాన్యాన్ని సిద్ధం చేశారు. ఆ ధాన్యాన్ని సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రామభక్తులకు పంపించారు. ఆ ధాన్యాన్ని భక్తులు ముక్కోటి ఏకాదశి నుండి శ్రీ రామనామం జపిస్తూ గోటితో ఒలుస్తూ అవి తలంబ్రాలుగా రూపాంతరం చెందించారు. శ్రీ రామతీర్థం సేవా సంఘం, భక్తులు, గ్రామస్తులు, భజనల కీర్తనలతో కోలాహలంగా తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, అభిషేక నిమిత్తం సరయూనది నీరు, కొబ్బరి బొండాలు రామతీర్థం పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకుని వచ్చారు. ఆ తలంబ్రాలను స్వామివారి పాదాల చెంత ఉంచి, పూజాదికాలు నిర్వహించారు. ఈ తలంబ్రాలను సహాయ కమిషనర్, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి.హెచ్.ఎస్.ఎస్. కిషోర్ కుమార్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు, సంఘ ప్రతినిధులు రేగాన గోవింద రావు, సుదర్శనం విజయకుమార్, ముంత ప్రసాద్, సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

బాడంగి : విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న 97మంది విద్యార్థులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులు మీదుగా బుధవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ముందుగా పాఠశాలవారి కంటి నిపుణులు స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి అనంతరం అవసరమైన వారికి మందులు, ఉచిత శస్త్ర చికిత్సలు, కళ్లద్దాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం చాలా అద్భుతమైన కార్యక్రమమని తెలిపారు. విద్యార్థులకు కంటి అద్దాలు వేసి చదివించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి, జిల్లా, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శాసనసభ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన

బాడంగి : బోయ, వాల్మీకి, బెంతు, ఒరియా కులాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఎరుకుల సేవ సంఘం అధ్యక్షులు, రాష్ట్ర టిడిపి ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు బుధవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ వాటిని పట్టించుకోని ప్రభుత్వం ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. వారిని ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అశాస్త్రీయ పద్ధతిలో శాసనసభలో తీర్మానం చేసి ఆదివాసులకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. తక్షణమే ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలు ఆపండి

బొబ్బిలి : అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలు ఆపాలని ఆర్‌డిఒ పి.శేషశైలజ ఆదేశించారు. కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు గట్లు, కోనేరు గట్లు, చెరువు గర్భాలలో నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై నిఘా పెట్టాలని తహశీల్దార్ రాజారావును కోరారు. అనంతరం చీపురు బందను పరిశీలించారు. బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో తహశీల్దార్ రాజారావు, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, టిపిఎస్ వరప్రసాద్, తదితరులు ఉన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. బొబ్బిలి నుంచి బలిజిపేట రోడ్డు వైండింగ్ నిమిత్తం నూతనంగా వేస్తున్నటువంటి తాగునీటి పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ శాఖతో పాటు కాంట్రాక్టర్‌కు త్వరగా పనులు పూర్తి చేసి మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఫిట్టర్ అప్పారావు, కాంట్రాక్టర్స్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బొద్దాంలో రోజువారీ మార్కెట్ వేలం

వేపాడ : మండలంలోని బొద్దాంలో బుధవారం ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో రోజువారి మార్కెట్ వేలం పాట వేశారు. ఈ వేలం పాటలో ఐదుగురు సభ్యులు పాల్గొనగా అదే గ్రామానికి చెందిన కుర్రాయ అప్పలకొండ రూ. 1.50లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఈ వేలం పాట ఏప్రిల్ ఒకటి నుండి 2024 మార్చి 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని పంచాయతీ ఆమోదం తెలిపినట్లు ఆయన వెల్లడించారు. ఈ వేలంపాటలో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, గ్రామ పెద్ద వై.సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి పద్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పతకాల పంట

పూసపాటిరేగ : విజయవాడకు చెందిన క్రీమ్ యంగ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ తన 10వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీ నిర్వహించింది. ఈ పోటీలకు పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మంది చిత్రాలను వేసి పంపించారు. వాటిలో 10 చిత్రాలకు బంగారుపతకాలు, 8 వెండి పతకాలకు ఎంపికయ్యాయి. వీరిలో డి.యశ్వంత్, జి.స్వాతి చంద్రరావు, శరణ్య, రిషిత, హేమశ్వంత్, మహేష్, శ్రావణిలు బంగారు పతకాలు సాధించారు. బుధవారం పాఠశాల ప్రధానోధ్యాయులు బలివాడ శంకరరావు, సిబ్బంది, పాటశాల చైర్మన్ శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఇనపకుర్తి చిన సత్యనారాయణను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జామి : మండలంలోని తానవరం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకు బలంగా డీ కొని, తానవరం గ్రామానికి చెందిన నారాయణరావు, విశాఖ జిల్లా పద్మనాధ మండలం గందవరం గ్రామానికి చెందిన పైడిరాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఇరువురి తలలకు గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. జామి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

డెంకాడ : మండలంలోని అమకాం పంచాయతీ బెల్లాంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం.. పూసపేట రేగ మండలం తొత్తడాం గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడు (36) కాంట్రాక్టర్ దగ్గర ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనులకు బెల్లాం వచ్చాడు. అక్కడ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా కరెంట్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఎస్ఐయు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భోగాపురం : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన భోగాపురం తోట వీధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం. భోగాపురం తోటవీధిలో ఉంటున్న రామిశెట్టి సాయిలక్ష్మి మంగళవారం బంటుపల్లిలో బంధువులు ఇంటికి వెళ్ళింది. ఇల్లు తాళం వేసి ఉండటంతో మంగళవారం రాత్రి దొంగలు పడి 12 తులాల వెండి చోరీ చేసారు. బుధవారం ఉదయం సాయి లక్ష్మి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ టీంతో రంగంలోకి దిగి పరిశీలించింది.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- విజయనగరం కోట

టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా అంతటా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. అశోక్ బంగ్లాలో నిర్వహించిన వేడుకల్లో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహిళా నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న సీనియర్ నాయకులను సన్మానించారు. అనంతరం అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఈ 41 ఏళ్లలో టిడిపి ఎన్నో విజయాలు సాధించి దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. టిడిపి తీసుకొచ్చిన అనేక సంక్షేమ కార్యక్రమాలు దేశానికే స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ధర్మరాజు(రాజేష్), కంది మురళి తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : స్థానిక టిడిపి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గెద్ద అన్నవరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బెల్లాన మల్లిస్వామి (జయబాబు), తాడ్డి కృష్ణ, నక్కాన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్.టి.ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తల


వేపాడ.. ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు


విజయనగరం : టిడిపి సీనియర్ నాయకులను సత్కరిస్తున్న మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, తదితరులు

సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, కొనదల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: టిడిపి ఆవిర్భావ దినోత్సవం నగర పంచాయతీతోపాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు... ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, కింతాడ కళావతి పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కోటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్ ఎగురవేశారు. అనంతరం ర్యాలీగా దక్షిణదేవుడి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, నివాళులర్పించారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పూసపాటిరేగ రాజువీధిలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. టిడిపి సీనియర్ కార్యకర్త మాజీ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు పిన్నింటి బంగారు నాయుడిని పూలమాలలు వేసి సాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు వెంపడాపు సూర్యనారాయణ, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు ఇజ్జోరోతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకిరి ప్రసాదరావు దంగా భూలోక, విక్రం జగన్నాథం, పతివాడ అప్పలనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, పాల్గొన్నారు.

వంగర: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి మోహనరావు జెండా ఆవిష్కరణ చేశారు. అరసాడ, నీలయ్యవలస, శ్రీహరిపురం ఆర్ఆర్ కాలనీ, కింజంగి, కోనంగిపాడు తదితర గ్రామాలలో తెలుగుదేశం జెండాను నాయకులు ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లచ్చుబుక్త కృష్ణమూర్తి, బెజ్జిపురం రవి, మజ్జి గణపతి, చింత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సాయిబాబా జంక్షన్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల నాయకులు బుధవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ కోట పంచాయతీ సర్పంచ్ కిర్రు పార్వతి, టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చౌక్కాకుల ముల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావు, కాసాపేట సర్పంచ్ కోళ్ల బూపాల్ నాయుడు, మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసి కొల్లి వెంకటరమణమూర్తి, పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేపాడ, వల్లంపూడి ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహాలకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎస్‌డిటి మండల అధ్యక్షుడు సేనాపతి గణేష్, పాల్గొన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి కొంట్యాడ రమణమూర్తి ఉపాధ్యక్షుడు పోతల రమణ ఆధర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

రేగిడి : టిడిపి 41 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రేగిడి గ్రామంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి మాజీ ఎంపిపి రామకృష్ణం నాయుడు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు టంకాల గోవిందరావు, టెంటు కృష్ణ, రామ్మూర్తి నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ పోలిపల్లిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రోతు రాజు, ముకుంద పాల్గొన్నారు.

గుర్ల : టిడిపి మండలాధ్యక్షుడు చనమల్ల మహేష్ ఆధ్వర్యంలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా అచ్చుతాపురం సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి మండల అప్పలనాయుడు, నియోజక వర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగుల పల్లి నారాయణ రావు, మండల ఉపాధ్యక్షులు కిలారీ సూర్యనారాయణ, పాల్గొన్నారు.

బయటపడ్డ గ్రూపు రాజకీయాలు

కొత్తవలస: టిడిపి 41 ఆవిర్భావ దినోత్సవ వేడకలు కొత్తవలస జంక్షన్‌లో ఘనంగా జరిగాయి. ఎన్‌టిఆర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు అయితే ఒకే చోట రెండు గ్రూపులుగా విడిపోయి వేరువేరుగా ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించడంతో గ్రూపుల పోరు బయటపడింది. ఏ గ్రూపు కార్యక్రమంలో పాల్గొనాలో తెలియక కార్యకర్తలు తికమక పడ్డారు. ముందుగా టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు పోలమరశెట్టి రాజన్న పాల్గొన్నారు. రెండో వర్గంగా కోళ్ల శ్రీను అధ్యక్షతన మరో కార్యక్రమాన్ని నిర్వహించడంతో పార్టీ శ్రేణుల్లో కొంత నిరాశ కలిగింది.

కార్మిక, కర్షక ప్రదర్శన జయప్రదం చేయండి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వచ్చే నెల 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీ కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం కర పత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించే చట్టాలు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ చిన రాంబాబు, హామాలీలు పాల్గొన్నారు.


డెంకాడ: ఏప్రిల్ 5న ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎన్.సూర్యనారాయణ కోరారు. బుధవారం మండలంలోని అక్కివరం, గంట్లాం రహదారిపై సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత దేశ ప్రజలు సంక్షేమం కన్నా, పెటుబడుదారుల సంక్షేమం పరమావధిగా భావిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.నరిసినాయుడు. జి.పెంటరాజులు పాల్గొన్నారు.

కొత్తవలస : వ్యవసాయం, కార్మిక, కర్షక హక్కుల కోసం ఏప్రిల్ 5 న జరిగే చలో పార్లమెంట్లో పాల్గొని, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు కోరారు. పాత సుంకర పాలెం చెరువులో ఉపాధి కూలీలతో ఆయన బుధవారం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. ఈ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తున్నరన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వికలాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో బుధవారం వికలాంగ విద్యార్థులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ చేతులు మీదుగా ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్ళ జోళ్ళు పంపిణీ చేశారు. క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. అనంతరం వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆసరా డబ్బులు వేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. 1190 సంఘాలకు గాను రూ. 11.10 కోట్లను అందిస్తున్నామన్నారు. రాష్ట్రానికి పట్టిన దరిద్రం పేరే చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి


ట్రైసైకిల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బంటుపల్లి వాసుదేవరావు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మీ, వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మి నాయుడు, కురాకుల అనిత, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి, ఎపిఎం విజయలక్ష్మి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక వైసిపి కార్యాలయం పక్కన గల ఖాళీ స్థలంలో బుధవారం వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలందరినీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత అక్క చెల్లెలుగా చూస్తున్నారన్నారు. అందువల్లనే మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన మాటకు కట్టుబడి వైయస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాధ రావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైస్ ఎంపిపి కర్రీ శ్రీదేవి, పార్టీ అధ్యక్షులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి, బాల భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఆర్‌పిలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి

పూసపాటిరేగ : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని గోవిందపురం పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్ తెలిపారు. బుధవారం పాఠశాలలో వార్షికోత్సవంతో పాటు పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో విధ్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది డిఇఒ లింగేశ్వర రెడ్డి నిర్దేశికత్వంలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. సర్పంచ్ రామలక్ష్మి మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విధ్యార్థులును కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విక్రం జగన్నాధం, జలపాల అప్పారావు, డి. ఈశ్వర్రావు, బాలా గోపాలరావు, బత్తుల లక్ష్మణరావు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సిఎం సహాయనిధి అందజేత

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో గ్యాస్ సిలెండర్ పేలి మృతి చెందిన జడ్డు సత్యం నాయుడు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.8 లక్షల చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం అందించారు. ఆ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జడ్డు సరస్వతికి ఈ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల పార్టీ ప్రెసిడెంట్ ఒబ్బిన నాయుడు, తుమ్మికపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, సచివాలయం కన్వీనర్ పిల్ల రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యాజీ, డబ్ల్యుఎన్‌శర్మ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్.కోట న్యాయవాదుల సంఘ ఎన్నికల్లో అల్లు సత్యాజీ ప్యానెల్ విజయం సాధించింది. ఎన్నికల అధికారి ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓటింగులో 24-19 ఓట్లతో అధ్యక్షుడిగా అల్లు సత్యాజీ, 23-20ఓట్లతో కార్యదర్శిగా డబ్ల్యు.ఎన్.శర్మ విజయం సాధించారు. ఉపాధ్యక్షుడుగా బి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వియ్యపు రమణ, లైబ్రరీ కార్యదర్శిగా రావాడ సత్యనారాయణ, ట్రెజరర్ గా బి.త్రిమూర్తులు, కార్యవర్గ సభ్యులుగా టీవీఆర్ మూర్తి, పిడిది రామకృష్ణ, నెక్కల సత్యనారాయణ, బి.సత్యనారాయణ, మీడియా సెక్రటరీగా బీవీఎస్ రామారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్లు సత్యాజీ మాట్లాడుతూ ఎస్.కోట కోర్టు శిథిలావస్థలో ఉందని, అధికారులు కోర్టును ఖాళీ చేయాలనే సూచన మేరకు నూతన భవన నిర్మాణం చేసే వరకు తాత్కాలికంగా కోర్టును పట్టణంలో అందుబాటులో ఉన్న భవనంలోకి మార్పు చేసి, న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమ ప్యానెల్‌కు సహకరించిన సీనియర్, జూనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, ఎస్వీవీ దాసు, గేదెల ప్రకాష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి శర్మ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి, సమస్యలు పరిష్కారానికి పాటు పడతానని స్పష్టం చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన న్యాయవాదుల సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణిని కలవగా ఆమె వారిని అభినందించారు.

ప్రాణాంతకంగా రొమ్ము కేన్సర్

నెల్లిమర్ల : ప్రస్తుతం మహిళలకు ప్రాణాంతకంగా మారిన ఆరోగ్య సమస్యల్లో రొమ్ము కేన్సర్ ఒక్కటని దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 2.26 మిలియన్ మంది ప్రాణాలు కోల్పోతున్నారని విశాఖలోని ఆయుష్మాన్ ఆసుపత్రి రేడియాలజిస్ట్ డాక్టర్ కర్రి స్వామి తెలిపారు. బుధవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏటా దీని బారిన పడేవారు లక్షల్లో ఉంటున్నారన్నారు. సాధారణంగా 40 ఏళ్ళ వయస్సు దాటిన వారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటీవల కాలంలో 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. సరైన అవగాహన ఉంటే ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే, ప్రాణాంతకం కాదని ఆయన వివరించారు. అనంతరం విసి ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ఆయనను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, పారామెడికల్ డీన్ డాక్టర్ లక్ష్మీనరసింహ ఆచార్యులు, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు, ఆసిఫ్, అనంతశర్మ, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, రేడియాలజీ, అనస్తీషియా విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆకస్మిక తనిఖీ

నెల్లిమర్ల : స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి గురుకులాల జిల్లా సమన్వయకర్త బలగ చంద్రావతి ఆకస్మికంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు ఏప్రిల్ 3 నుండి జరగనున్న పబ్లిక్ పరీక్షలు చక్కని నైపుణ్యంతో, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ పరీక్షలు బాగా రాయాలన్నారు. ఇంతవరకు జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు పరీక్షలు ఎలా రాసారో అడిగి తెలుసుకున్నారు. పరీక్షల అనంతరం సెలవులో ఇంటికి వెళ్లకుండా అందరూ హాస్టల్‌లోనే ఉంటూ వ్యక్తిత్వ వికాస నైపుణ్యం, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు నేర్చుకోవాలన్నారు.

గరివిడిలో రైతు సమ్మేళనం

గరివిడి : స్థానిక శ్రీ వెంకటేశ్వర పసువైద్య విశ్వవిద్యాలయంలో రైతు సమ్మేళన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ జి వెంకట్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు పాల దిగుబడి కోసం పాటించవలసిన మెలకువల గురించి వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవి రమణ పశు జనరిక్ మందులు గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపడుతున్న సేవలపై మాట్లాడారు. నాబార్డు డిడిఎం టి. నాగార్జున మిశ్రమ వ్యవసాయ విధానం గురించి రైతులకు వివరించారు.

31లోగా పన్నులు చెల్లించండి

బొబ్బిలి : ఈనెల 31లోగా ఆస్తిపన్ను, కుళాయి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో బుధవారం ఆస్తిపన్ను, కుళాయి పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోగా పన్నులు చెల్లించాలని కోరారు. ఈనెల 31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భోజరాజపురం పంపు హౌస్ వద్ద వేగావతినదిలో వేస్తున్న ఇసుక బస్తాల గట్టు పనులను పరిశీలించారు.

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా న్యాయస్థానం విజయనగరం వారి కోర్టులో
M.V.O.P.140/2022

Between:
సారికి శ్రీనివాసు .....పిటిషనర్
And:
అక్కివరపు అనంతకుమార్ మరియు ముగ్గురు ......రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం.3 :
బారికి చిన్నారావు, S/o లేటు శిమ్మయ్య, D.No.21-31-17A, బిట్ నెం.2, పూల్‌బాగ్‌కాలనీ, ఆపో్ భవన్, విజయనగరం కార్పొరేషన్.

పై నెంబరు కేసు/పిటిషన్‌లో అనేక సార్లు పై కోర్టువారి నుండి మీకు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తం పై కేసు/పిటిషను తే 10-04-2023దికి వాయిదా ఉన్నది. కావున **తే 10-04-2023దీన ఉదయం గం॥ 10-30 ని॥**లకు మీరు కాని లేదా మీ తరపు వకీలు గారు కాని పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పై కేసు/పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించబడును.

దుర్గాశి శ్రీరాములు,
గేదెల సత్యం
న్యాయవాదులు,
విజయనగరం,
సెల్ : 9490462329

మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.49/2023 IA 148/2020

బిట్వీన్ :-
రెడ్డి గోవిందనాయుడు మరియొకరు...వాదులు
ఎండ్ :-
బాలి కంచయ్య వగైరా .....ప్రతివాదులు

నోటీసు

To
D2. బాలి సత్యం, S/o నారాయణ, వయస్సు 63సం॥లు, బుదరాయవలస గ్రామం, మెరకముడిదాం మండలం.

పై నెంబరు గల దావాను వాదులు పెర్మినెంట్ ఇంజక్షన్ కొరకు దాఖలు చేసియున్నారు. అటులనే వాదులు IA 148/2020 నెంబరు గల Interim Injunction పిటిషను దాఖలు చేసి యున్నారు. సదరు దావా మరియు IA 148/2020 మీ హాజరు నిమిత్తం **తే 3-4-2023దీ**ని వాయిదా అయిఉన్నది. కనుక ఆ **దినము ఉదయం గం॥ 10-30 ని॥ల**కు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరయి మీ వాదన తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఆదేశానుసారం)

శ్రీ బెల్లాన రవి, ఏడ్వకేట్,
గవర్నమెంట్ ప్లీడర్, కస్పావీధి,
చీపురుపల్లి. సెల్: 9440522779

మహారాజశ్రీ జిల్లా జడ్జి వారి కోర్టు : విజయనగరంలో
A.S.50/2022

శ్రీమతి పొదిలాపు వసంతకుమారి మరియు యితరులు. .....అప్పిలెంట్లు
యెదిరి
కుర్రే శివలీల ....రెస్పాండెంట్
టు
కుర్రే శివలీల, భర్త లక్ష్మారెడ్డి, వయస్సు సుమారు 54 సంవత్సరములు, అల్లూరి సీతారామరాజు నగర్, జమ్ము నారాయణపురం గ్రామం, విజయనగరం మండలం మరియు జిల్లా.

పై నంబరు గల అప్పీలులోని అప్పిలెంట్లు, పైన పేర్కొన్న కోర్టులో మీపైని పై అప్పీలును దాఖలు చేసి, అందు మీరు దాఖలు చేసిన O.S.112/2013 నంబరు గల దావాలో తెలియజేసిన మీ చిరునామాను పేర్కొని, సదరు చిరునామాకు సమనులు పంపగా "Addressee left" అని ఎండార్సుమెంటు వచ్చినందున, మరియు మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనుట లేదని భావించి, శ్రీ కోర్టువారు ఈ పత్రికా ముఖముగా మీకు సమనులు పంపుటకై ఆదేశించి, మీ హాజరుకై సదరు అప్పీలును తే.10.04.2023 నాటికి వాయిదా వేసియున్నారు. కావున **తే.10.04.2023దీ ఉదయం గం.10-30** లకు మీరు స్వయముగా గాని, లేక మీ వకీలుద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ వాదనను వినిపించుకొనవలెను. లేనియెడల లభ్యమగు రికార్డుల మూలముగా మీ పరోక్షములో తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆదేశములతో ప్రచురించడమైనది)

కె. కృష్ణ మూర్తి,
ఎస్.ఎస్.ఎస్.వి. రామచంద్ర రావు,
అప్పిలెంట్ల తరపు న్యాయవాదులు,
కూరెళ్ళ వారి వీధి, కొత్తపేట,
విజయనగరం - 535002.